సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

ఘట్‌కేసర్: కొర్రెముల్ గ్రామానికి చెందిన లబ్ధిదారురులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన నిధులకు సంబంధించిన చెక్కులను మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి నగరంలోని తన కార్యలయంలో గురువారం పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన బాబురావు, యాదగిరిలు అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందగా ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ. 34 వేలు, రూ. 25,500లు మంజూరయ్యాయి. కార్యక్రమంలో నాయకులు నాగరాజ్‌గౌడ్, దుర్గరాజ్‌గౌడ్, యాదగిరి, రవి, ఆనంద్, రాములు పాల్గొన్నారు.

మేడ్చల్‌లో న్యాయవాదుల నిరసన



మేడ్చల్ కోర్టులో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

మేడ్చల్: జనగామ పోలీస్ స్టేషన్‌లో మహిళా న్యాయవాది పట్ల అసభ్య పదజాలంతో పోలీసులు ప్రవర్తించిన తీరును నిరసిస్తూ మేడ్చల్ న్యాయస్థానాల్లో న్యాయవాదులు తమ విధులను బహిష్కరించిన నిరసన తెలిపారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తమ విధులను బహిష్కరించి న్యాయస్థానం ఆవరణ నిలబడి నిరసన తెలిపారు. మహిళా న్యాయవాది పట్ల అసభ్యంగా మాట్లాడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మేడ్చల్ కోర్టుల న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల ఆందోళన



శామీర్‌పేట్: రాష్ట్ర వ్యాప్త సఫాయి బంద్‌లో భాగంగా గురువారం మండలంలోని అలియాబాద్‌లో పంచాయతీ కార్మికులు ఆందోళన నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్మికులను పర్మనెంట్ చేయాలని, మల్టీపర్పస్ పని విధానాన్ని రద్దు చేయాలని, రూ. 26 వేల జీతం ఇవ్వాలని కోరుతూ పంచాయతీ కార్యాలయం ఎదుట కార్మికులు ఆందోళన చేశారు. గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కిష్టప్ప, నాయకులు రవి, కృష్ణ, ప్రశాంత్, కార్మికులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన తమిళనాడు బృందం

కీసర: కీసరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అదనపు ముఖ్య కార్యదర్శి నేతృత్వంలో తమిళనాడుకు చెందిన ఆరోగ్య అధికారుల బృందం గురువారం సందర్శించింది. పీహెచ్‌సీలో ప్రాథమిక సంరక్షణ, నాణ్యతా ప్రమాణాలు, డిజిటల్ హెల్త్, ఆరోగ్య కేంద్రంలో చేరిన రోగులకు ఆహార ఏర్పాట్లు, రోగి అనుభవం, పారిశుద్ధ్యం, అలంభిస్తున్న పరిశుభ్రత విధానాలు వంటి పలు అంశాలను పరిశీలించి విలువైన సూచనలు అందించింది. కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ టి.రఘునాథ్‌స్వామి, కీసర డివిజన్ ఉప వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ సత్యవతి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా.సరస్వతి, జిల్లా కార్యక్రమ అధికారి డా.మల్లీశ్వరి, జిల్లా నాణ్యత మేనేజర్ సురేష్, పీహెచ్‌సీ వైద్యాధికారులు డా.సౌందర్యలత, డా.సుష్మ, బస్తీ దవాఖానా వైద్యులు, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

మల్లారెడ్డి అగ్రికల్చర్ కళాశాలలో విద్యార్థి మృతి



అరుణ్‌కుమార్ (ఫైల్)

మేడ్చల్‌రూరల్: తరగతి గదిలో స్పృహ తప్పి పడిపోయి విద్యార్థి మృతి చెందిన సంఘటన గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీలో గురువారం చోటు చేసుకుంది. వివరాలివీ... స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ సైన్సెస్ కళాశాలలో బీఎస్సీ మొదటి సంవత్సరం చదువుతున్న నల్లగొండ జిల్లాకు చెందిన విద్యార్థి అరుణ్‌కుమార్(19) రోజూలానే గురువారం కళాశాలకు వెళ్లాడు. మధ్యాహ్నం 1.40 గంటల సమయంలో అరుణ్‌కుమార్ తరగతి గదిలో ఒక్కసారిగా స్పృహ కోల్పోయి కిందపడ్డాడు. దీంతో తోటి విద్యార్థులు యాజమాన్యానికి విషయం తెలుపగా వారు అంబులెన్స్‌కు సమాచారం అందించి చికిత్స నిమిత్తం మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మరణించినట్లు ధ్రువీకరించారు. ఇదిలా ఉండగా యాజమాన్యం ఆలస్యం కారణంగానే విద్యార్థి మరణించినట్లు తోటి విద్యార్థులు ఆరోపిస్తున్నారు. స్పృహ తప్పి పడిపోయిన 20 నిమిషాల తర్వాత అంబులెన్స్ కళాశాలకు చేరుకుందని, అప్పటిలోపు తమ కారులో ఆస్పత్రికి తీసుకెళ్లామని తోటి మిత్రులు తెలిపినా యాజమాన్యం వినకుండా అంబులెన్స్ వచ్చేంత వరకు వేచి ఉండి చికిత్సకు తరలించడంతో గుండెపోటుకు గురై మరణించనట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంధనం చోరీకి యత్నం

ఘట్‌కేసర్: ఏటీఎఫ్ ఇంధనం చోరీకి యత్నించిన ఓ వ్యక్తిపై ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేశారు. సబ్ ఇన్‌స్పెక్టర్ నర్సింహా సమాచారం మేరకు... పోలీసులు పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తుండగా హెచ్‌పీసీఎల్ సమీపంలోని ఓ ప్రదేశంలో టీఎస్06 యూటీ 4860 నంబర్ ఇంధన ట్యాంకర్ నుంచి డీజిల్ ట్యాంకు వరకు పైపును బిగించినట్లు కనిపించింది. పోలీసులను చూసి అతడు పారిపోయే యత్నం చేశాడు. అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా మహబూబ్‌నగర్ జిల్లా ఇర్విన్ మండలం దిల్వార్‌ఖాన్‌పల్లి గ్రామానికి చెందిన బావాజీ సైదులు(33)గా తేలింది. హెచ్‌పీసీఎల్ ఇంధన ట్యాంకుకు డ్రైవర్‌గా ఉన్నానని, ఏటీఎఫ్ ఇంధనంతో ఎయిర్‌పోర్టుకు వెళుతున్నాడని తెలిపాడు. అక్రమంగా సంపాదించేందుకు ఇంధనాన్ని దొంగిలించి వాహనంలోని ఇంధన ట్యాంకులో నింపుతున్నాడు. అప్పటికే అతడు సుమారు 10–15 లీటర్ల ఇంధనం తీశాడు. పంచనామా అనంతరం పోలీసులు ఇంధన ట్యాంకర్, పైపు, ఇనుప రాడ్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వీడని సందిగ్ధత!





- పూర్తయిన జీఓ 58, 59 జీఓల దరఖాస్తుల పరిశీలన
- జిల్లాలో కింద వచ్చిన దరఖాస్తులు 41,292
- ప్రభుత్వం నిర్ణయం కోసం ఎదురు చూపులు

సాక్షి, సిటీబ్యూరో: సర్కారు భూములను ఆక్రమించిన చేపట్టిన నివాస స్థలాల క్రమబద్ధీకరణకు సంబంధించిన జీఓ: 58, 59 దరఖాస్తుల పరిశీలన కార్యక్రమం పూర్తయినప్పటికీ ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. ధరణి పోర్టల్‌పై విచారణ కమిటీ నేపథ్యంలో ప్రభుత్వం జీఓ: 58, 59ల దరఖాస్తుల విషయంలో ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. దీంతో రెవెన్యూ శాఖ అధికారులు జీవో 58, 59లపై ప్రభుత్వ ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో జీఓ 58 కింద 26,092 దరఖాస్తులు రాగా, 15 మండలాల పరిధిలోని పురపాలికలు, గ్రామ పంచాయతీల్లో 41 బృందాలు క్షేత్ర స్థాయిలో విచారణ నిర్వహించారు. అలాగే జిల్లాలో జీఓ 59 కింద వచ్చిన 15,200 దరఖాస్తులను కూడా క్షేత్ర స్థాయిలో 41 బృందాలు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టారు.

అత్యధిక దరఖాస్తులు ఇక్కడే...

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోనే జీఓ 58, 59ల కింద దరఖాస్తులు 41,292 వచ్చాయి. తెలంగాణ రాష్ట్రంలోనే ఈ దరఖాస్తుల సంఖ్య అత్యధికమని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. దరఖాస్తుల విచారణలో భాగంగా ఇళ్ల పరిశీలన బృందాల్లో డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సర్వేయర్ ఉండేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. ప్రతి క్షేత్ర స్థాయి బృందం ఇంటి ఫొటో అప్‌లోడ్ చేయటంతోపాటు జీవో నిబంధనల ప్రకారం ఉన్నాయా? లేదానని చెక్ చేసుకోవటం, సేకరించిన ఆధారాలను ప్రత్యేకంగా రూపొందించిన 'మొబైల్ యాప్'లో నమోదు చేసి, వాటిని కలెక్టర్ లాగిన్ సిఫార్సు చేయటం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ దరఖాస్తులను వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా మరో మారు పరిశీలించిన తర్వాత ఆమోదం లేదా తిరస్కరించే అవకాశం ఉంటుంది.

గతంలో వచ్చిన జీఓ 59 దరఖాస్తులపై...

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మొదటి విడత (గతంలో)లో జీఓ 59 కింద 33,258 దరఖాస్తులు రాగా, అధిక (ప్రాధాన్యత) విలువ కలిగిన భూములకు సంబంధించిన 5 వేల దరఖాస్తుల వివరాలను అధికార యంత్రాంగం ప్రభుత్వానికి నివేదించింది. సర్కారు ఆదేశాల మేరకు 5 వేల దరఖాస్తులను పరిశీలించిన రాష్ట్ర ఉన్నతాధికారులు క్షేత్ర స్థాయిలో విచారించి, అర్హులైన లబ్ధిదారుల నుంచి జీఓ 59లో పేర్కొన్న విధంగా సొమ్ము వసూలు చేయాలని సూచించారు. ఈ నేపథ్యంలో స్పందించిన అధికార యంత్రాంగం పెండింగ్‌లో ఉన్న 5 వేల దరఖాస్తులను ప్రత్యేక బృందాలతో క్షేత్ర స్థాయిలో విచారణ నిర్వహిస్తున్నారు. ఈ దరఖాస్తుల పరిశీలన కార్యక్రమం కూడా పూర్తయింది. వీటిపై కూడా సందిగ్ధత నెలకొనటంతో ప్రభుత్వం నిర్ణయం కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

నేత్రపర్వం.. గోదారంగనాథుల కల్యాణం



ఎదులాబాద్ శ్రీ గోదాదేవి సమేత రంగనాయక స్వామి కల్యాణ వేడుకలు

ఘట్‌కేసర్: ఎదులాబాద్ శ్రీ గోదాదేవి సమేత శ్రీ మన్నారు రంగనాయక స్వామి బహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ గోదాదేవి కల్యాణ మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని, స్వామివారిని నూతన వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి కల్యాణ మండపంపై ప్రతిష్ఠించారు. ఆలయ ధర్మకర్తలు తిరువదండం పోరెత్తి వంశస్తుల వేద మంత్రోచ్ఛరణల నడుమ నేత్రపర్వంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి కల్యాణంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కౌన్సిలర్ బాల్‌రెడ్డి, ఎంపీఓ రవి, మాజీ ఎంపీపీలు శ్రీనివాస్‌గౌడ్, సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు కుమార్‌ముదిరాజ్, ఎం.రవి, ధర్మారెడ్డి, జి.రవి, ఏసీపీ చక్రపాణి, ఇన్‌స్పెక్టర్ సైదులు, చిరంజీవి ముదిరాజ్, లక్ష్మణ్, రఘు, శంకర్, రాజేందర్‌గౌడ్, లింగేశ్వర్, మాజీ ఎంపీటీసీ రవి, ప్రవీణ్‌రెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'స్వచ్ఛదనం–పచ్చదనం'

మేడ్చల్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమం మేడ్చల్ మున్సిపాలిటీలలోని అన్ని వార్డులు, మండలంలోని అన్ని గ్రామాలలో గురువారం కొనసాగింది. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల వద్ద పలు కార్యక్రమాలను నిర్వహించారు. రోడ్లు, ఇళ్ల పరిసరాలలో నిల్వ ఉన్న వర్షపు నీటిని శుభ్రం చేయించారు. గుంతలయంగా ఉన్న రోడ్లపై వెట్ మిక్స్‌లు వేసి మరమ్మతులు చేయించారు. పాఠశాలలో విద్యార్థులతో సమావేశాలు నిర్వహించి సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కలిపించారు. వ్యాధులు ఎలా ప్రబలుతాయి, ప్రబలకుండా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలను వివరించారు. మున్సిపల్ చైర్ పర్సన్ దీపిక నర్సింహారెడ్డి, కమిషనర్ నాగిరెడ్డి, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో సీజనల్ వ్యాధులకు చెక్

ఘట్‌కేసర్: డెంగీ, మలేరియా లాంటి జ్వరాలు ప్రజలకుండా ప్రజలు తమ ఇళ్ల పరిసరలను శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య పేర్కొన్నారు. స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గురువారం ప్రత్యేక అధికారి ప్రశాంత్, కమిషనర్ సాబేర్ అలీతో కలిసి కొండాపూర్ ప్రాథమిక పాఠశాల, హరిజనవాడలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. అనంతరం స్థానికులతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కుక్కలకు ఇంటి దగ్గర ఆహారం పెట్టకూడదని, ఆహారం పెట్టాలనుకుంటే ఎవరూ లేని ప్రదేశంలో పెట్టాలన్నారు. కౌన్సిలర్లు వెంకట్‌రెడ్డి, శశికళ, నర్సింగ్‌రావు, నాయకులు రాధాకృష్ణముదిరాజ్, దేవేందర్ ముదిరాజ్, ఆంజనేయులు, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

కేన్సర్‌పై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ చిన్నబాబు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం విద్యార్థులకు కేన్సర్ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రేసీ కేన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ చిన్న బాబు మాట్లాడుతూ... ఆహారపు అలవాట్ల ద్వారా కేన్సర్ బారిన పడకుండా నివారించుకోవచ్చన్నారు. వ్యాధిని మొదటి స్టేజిలో గుర్తిస్తే మరింత సులువుగా నివారించే అవకాశం ఉందని ఆయన స్పష్టం చేశారు. 40 ఏళ్ల దాటిన ప్రతి ఒక్కరూ కేన్సర్ స్క్రీనింగ్ టెస్ట్ చేయించుకోవాలని సూచించారు. వ్యాధి వల్ల రోగితో పాటు కుటుంబ సభ్యులు, సమాజం కూడా బాధపడుతుందని తెలిపారు. కేన్సర్ వ్యాధి, దాని వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. అనంతరం అక్టోబర్ 6న నగరంలో నిర్వహించే రన్ ఫర్ కేన్సర్ స్క్రీన్ ఫర్ లైఫ్ కార్యక్రమ కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీలత, సెక్రటరీ టి.వి.రెడ్డి, డైరెక్టర్లు అనురాగ్‌రెడ్డి, సరోజారెడ్డి, పీఆర్వో రవి సుధాకర్, కో ఆర్డినేటర్ రాజేశ్, పీడీ రత్నకుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వీధి కుక్కల సమస్యకు త్వరలో చెక్



కుక్కలను తీసుకెళ్లే సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ నాగిరెడ్డి

మేడ్చల్: మేడ్చల్ పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న వీధి కుక్కల సమస్యలకు త్వరలో పరిష్కరించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బట్టు నాగిరెడ్డి అన్నారు. పట్టణంలో 23వ వార్డులో కుక్కలకు టీకాలు వేసేందుకు తీసుకెళ్లే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. పట్టణంలోని అన్ని వీధి కుక్కలకు వాక్సినేషన్ చేసేందుకు బ్లూ క్రాస్ ఆఫ్ హైదరాబాద్ ఎనిమల్ బర్త్ కంట్రోల్, యాంటీ రేబిస్ ప్రోగ్రాం ఫర్ స్ట్రీట్ డాగ్స్ వారి సహకారంతో పట్టణంలో అన్ని వీధి కుక్కలకు బర్త్ కంట్రోల్ టీకాలు వేయిస్తున్నట్లు తెలిపారు. రేబిస్ టీకాలు, జన్ను ఉత్పత్తి టీకాలు వేసి కుక్కలను తిరిగి పట్టణంలో వదిలి పెడతారని తెలిపారు. పట్టణంలోని 23 వార్డులలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కొడే మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

వేడుకగా పెద్దమ్మ తల్లి బోనాలు

ఘట్‌కేసర్: ఎదులాబాద్ గ్రామంలో ముదిరాజ్‌ల ఆరాధ్య దైవం పెద్దమ్మ తల్లి బోనాల పండుగ గురువారం ఘనంగా నిర్వహించారు. పసుపు, కుంకుమ, వేపాకులతో బోనాలను అలంకరించి డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం అమ్మవారి ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేసి బోనాలు, నైవేద్యాలు సమర్పించారు. ఊరేగింపులో శివసత్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.



బోనాలను తీసుకొస్తున్న భక్తులు

జ్యువెలరీ షాప్ చోరీ కేసు త్వరలో ఛేదిస్తాం



జ్యువెలరీ షాపులో చోరీ తీరు పరిశీలిస్తున్న డీసీపీ

శామీర్‌పేట్: తూంకుంట మున్సిపాలిటీలోని కృష్ణ జ్యువెలరీ షాపులో దొంగతనం కేసును త్వరలోనే ఛేదిస్తామని మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి అన్నారు. గురువారం పేట్ బషీరాబాద్ ఏసీపీ రాములు, శామీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్, డీఐలతో కలిసి ఘటన జరిగిన షాపును సందర్శించారు. చోరీ తీరును డీసీపీ పరిశీలించారు. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన అవసరం



నాగారంలో మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి పిలుపునిచ్చారు. స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గురువారం మున్సిపల్ పరిధిలోని 6వ వార్డులోని శిల్పానగర్‌లో నిలిచి ఉన్న నీటిలో స్ట్రాంవాటర్ డ్రైన్‌లో టెమోఫాస్ స్ప్రే, ఆయిల్ బాల్స్ వేశారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో కుక్కలకు ఉచిత రేబిస్ టీకాలను వేయించారు. 12వ వార్డులో సీజనల్ వ్యాధుల గురించి వీధికుక్కల దాడుల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

- దమ్మాయిగూడ మున్సిపాలిటీలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్, కమిషనర్ నాగమణి పాల్గొన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు, సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.
- కీసర మండలంలోని గోధుమకుంట గ్రామంలో చేపట్టిన కార్యక్రమలలో మండల ప్రత్యేకాధికారి పూర్ణిమ, ఎంపీడీఓ గ్యామ పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రౌండ్ వాటర్ ఆఫీసర్ (స్పెషల్ అధికారి) రేవతి, మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్, వైస్ చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్, కౌన్సిలర్లు కౌకుట్ల అనంతరెడ్డి, మోకు రేణుకా జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

108లో ఉద్యోగ అవకాశాలు

మేడ్చల్: ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ సంస్థలోని 108 కాల్ సెంటర్‌లో పలు ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని సంస్థ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ షేక్ జాన్‌షాహిద్ తెలిపారు. శుక్రవారం నుంచి ఈ నెల 31 వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్యాడ్యుయేట్, అండర్ గ్రాడ్యుయేట్‌లు ఉద్యోగాలకు అర్హులని తెలిపారు. ఇంటర్వ్యూలను నగరంలోని వెంగళరావు నగర్, ఎస్ఆర్ నగర్, అమీర్‌పేట్ కార్యాలయల్లో నిర్వహిస్తారన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న వారు ఫోన్స్: 92461 71575, 95505 20402లలో సంప్రదించాలని కోరారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు తమ అర్హతలకు సంబంధించిన ఒరిజినల్ ధ్రువపత్రాలను తీసుకెళ్లాలని సూచించారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ

కీసర: కేరళలోని వయనాడ్ వరద బాధితుల సహాయార్థం సీఐటీయూ నాయకులు గురువారం దమ్మాయిగూడలో ఇంటింటికీ తిరిగి విరాళాలను సేకరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎర్ర అశోక్ మాట్లాడుతూ... వయనాడ్‌లో ప్రకృతి వైపరీత్యం వల్ల అనేక కుటుంబాలు వరదల్లో చిక్కుకొని చనిపోయారన్నారు. ఈ విషాద ఘటనతో బాధపడుతున్న వారి కోసం విరాళాలు సేకరిస్తున్నామన్నారు. బాధితులను ఆదుకోవడానికి కేరళ ప్రభుత్వం కృషి చేస్తున్నప్పటికీ మన వంతు కర్తవ్యంగా వారికి సాయం చేద్దామన్నారు. ఈ రోజు సేకరించిన రూ. 4510 వరద బాధితుల నిధికి అందజేశామన్నారు.

సీపీఐని బలోపేతం చేయాలి

పోచారం: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)ని బలోపేతం చేయడానికి కార్యకర్తలు కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సాయిలు గౌడ్ అన్నారు. గురువారం అన్నోజిగూడలోని రాజీవ్ గృహకల్ప కాలనీలో జరిగిన సీపీఐ నిర్మాణ కౌన్సిల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీని బలోపేతం చేసేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని కోరారు. వికలాంగుల కాలనీలో కబ్జాకు గురైన 2 ఎకరాల భూమిని తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. మండల నాయకులు కె.జయచంద్ర, లొట్టి ఈశ్వర్, ఎస్‌కే అన్వర్ పాషా, సదాశివ, సయ్యద్ ఖాదర్, నరేంద్ర ప్రసాద్, కిష్టయ్య, సరిత, అనిత తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం ఉన్నంత వరకూ ప్రజలకు సేవ చేస్తూనే ఉంటా

మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

మేడ్చల్‌రూరల్: నా కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు ప్రజలకు సేవ చేస్తూనే ఉంటానని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. మండలంలోని రావల్‌కోల్ గ్రామంలో గురువారం గంగపుత్ర సంఘం నూతన భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఒకప్పుడు గ్రామ ప్రజలు దుమ్ము, ధూళితో ఇబ్బందులు పడేవారని తాను మంత్రిగా ఉన్న సమయంలో ప్రతి గల్లీలో సీసీ రోడ్లు వేయించానని గుర్తు చేశారు. గంగపుత్ర సంఘం భవనాన్ని ప్రారంభించుకోవడం సంతోషకరం ఉన్నారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, మాజీ వైస్ ఎంపీపీ వెంకటేశం, మాజీ సర్పంచ్ మహేందర్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దయానంద్‌యాదవ్, యూత్ అధ్యక్షుడు హరత్‌రెడ్డి, నాయకులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

అసాంఘిక శక్తుల ఆటకట్టిస్తాం

మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి

మేడ్చల్‌రూరల్: రేషన్ బియ్యం అక్రమ రవాణా, గంజాయి తరలింపు వంటి అసాంఘిక శక్తులను వదిలేది లేదని మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం మేడ్చల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం లారీ పట్టివేత వివరాలను వెల్లడించాడు. నగరంలోని ఎల్బీనగర్‌కు చెందిన ఫయాజ్ ప్రభుత్వం పేదలకు అందించే రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలించే వ్యాపారం సాగిస్తున్నాడు. సిద్దిపేట జిల్లా గజ్వేకు చెందిన రత్నాకర్ అలియాస్ సన్నీతో వ్యాపార బంధం ఏర్పడింది. నగరం నుంచి గజ్వేల్‌కు పీడీఎస్ బియ్యం తరలించేందుకు కర్నాటక రాష్ట్రం చెందిన లారీ డ్రైవర్ ఒడ్డుల్కర్ రాజశేఖర్(42) ఏర్పరచుకుని అక్రమ వ్యాపారం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో గత బుధవారం ఎల్బీనగర్ నుంచి 17.5 టన్నుల రేషన్ బియ్యాన్ని గజ్వేల్‌కు తరలిస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు మేడ్చల్ ఎస్ఓటీ, సివిల్ పోలీసులు పోలీస్‌స్టేషన్ పరిధిలోని కండ్లకోయ వద్ద సాయంత్రం తనిఖీలు చేపట్టారు. అక్రమంగా బియ్యం తరలిస్తున్న లారీ(కేఏ 398077)ని పట్టుకుని తనిఖీలు నిర్వహించగా పీడీఎస్ బియ్యం ఉండటంతో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని లారీ సీజ్ చేశారు.. డ్రైవర్ రాజశేఖర్‌ను గురువారం రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో ఏ1గా ఉన్న ఫయాజ్, ఏ2 రత్నాకర్ పరారీలో ఉన్నారని వారిని త్వరలో అదుపులోకి తీసుకుని కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వీరిపై గతంలో పలు కేసులు నమోదైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఓటీ, మేడ్చల్ పోలీసులను అభినందించారు. సైబరాబాద్ సీపీ ఆదేశాల మేరకు గంజాయి, పీడీఎస్ బియ్యం తరలింపుపై ప్రత్యేక నిఘాతో చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్ శ్యాం సుందర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలను అమలు చేయాలని ధర్నా



సాక్షి, సిటీబ్యూరో: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ మేడ్చల్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మేడ్చల్ డివిజన్ కార్యదర్శి వి.ప్రవీణ్ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు కావస్తున్నా 6 వాగ్దానాలను పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదన్నారు. ఆటో మోటార్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఇవ్వాలని, ఆటో మెయింటినెన్స్ కోసం సంవత్సరానికి రూ. 12 వేలు ఇవ్వాలని కోరారు. మహాలక్ష్మి పథకంతో నష్టపోతున్న ఆటో డ్రైవర్లను ఆదుకోవాలన్నారు. ఆర్టీసీలో పర్మనెంట్ ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. వృద్ధులు, వికలాంగులకు నెలకు రూ . 4 వేలు పెన్షన్, ఇండ్లు లేని పేదలకు ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ. 10 లక్షలు ఇవ్వాలన్నారు. విద్యార్థులకు సంవత్సరానికి రూ. 5 లక్షల గ్యారంటీ కార్డు ఇవ్వాలన్నారు. ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు డి.స్వరూప, మేడ్చల్ డివిజన్ నాయకురాలు బి.లక్ష్మీబాయి, పార్టీ నాయకులు బి.ప్రభాకర్, మహమ్మద్ అఫ్జల్, మొహమ్మద్ కాజామియా, ఆటో యూనియన్ నాయకులు పి.కృష్ణ ముదిరాజ్, డి.అశోక్, ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెంపుడు కుక్కలకు టీకాలు



పెంపుడు కుక్కలకు టీకాలు వేస్తున్న దృశ్యం

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమం గురువారం కొనసాగింది. కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ అధికారులు, పాలకవర్గం, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో చిన్నారులు, మనుషులపై కుక్కలు దాడి చేసినప్పుడు తీసుకోవల్సిన జాగ్రత్తలపై మున్సిపల్ ప్రజలు, స్వయం సహాయ సంఘాలు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. డెంగీ, మలేరియా తదితర సీజనల్ వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచించారు. పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ (ఏఆర్‌వీ) టీకాలు వేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ మద్దుల లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ ప్రభాకర్, కమిషనర్ స్వామి, ప్రత్యేకాధికారి వినోద్, పశుసంవర్ధక శాఖ అధికారులు కురుమూర్తి, సుధ, కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.